# మెఱుపులు: జ్ఞానము, విజ్ఞానము

- వేమూరి వేంకటరామనాథం

ఈ రెండు పదాలకు గల భావవైవిధ్యం, లేక భేదం, మనం ప్రత్యేకంగా గమనించకుండా ఉపయోగించే వాక్యాలలో కూడ ఉంది. ఉదాహరణకు, "ఇన్నేళ్ళు వచ్చినా వాడికి జ్ఞానం సున్న" అంటాము; "విజ్ఞానం" అనము. "ఇది చేయకూడదని ఆ మాత్రం జ్ఞానము లేదురా" అని గదమాయిస్తాము, ఎవరైనా తప్పు చేసి నప్పుడు; "విజ్ఞానం" లేదురా అనము. మఱొక సూటిగూటింపు; "ఎందుకు ఇంత చదువు చదివాడు, ఈ మాత్రం జ్ఞానం వాడికి లేదు!" ఈ వాక్యంలో చదువు వలన కలిగే ప్రజ్ఞకు, జ్ఞానం వలన లభించే సన్మార్గానికి గల వ్యత్యాసం అదృశ్యంగా ధ్వనిస్తుంది. "ఇంత చదువు" అనటంలో ఆ వ్యక్తికి గల విజ్ఞాన వైశాల్యం కొంతగా సూచించబడుతుంది. అది యెంత ఉధృతంగా ఉన్నా, వానికి ఒక ముఖ్యమైన లక్షణం కొఱవడుతున్నది, అన్న భావం ఈ వాక్యంలో ఉంది.

"విజ్ఞాన సరస్వము" అన్న బృహద్గ్రంథం మనకు పరిచితమైనదే (ఇంగ్లీషులో ఎన్ సైక్లోపీడియా అంటాము). ఈ గ్రంథం లో మధ్యమధ్య క్రొత్త విషయాలను, శీర్షికలను పెంచి, అంతవఱకు లభ్యమైన విషయ పరిజ్ఞానం పాఠకునికి కలుగ చేస్తారు. ఇది అవసరమైన ప్రచురణ కార్యమే. ఏలనంటే మానవునికి తెలిసిన విషయాల పరిధి, లోతు, పూర్ణస్వరూపం రోజులు గడచిన కొలది మఱింతగా విశదం అవుతూ ఉంటాయి. కొన్ని శాఖలలో ఒకప్పుడు మనకు అంతగా విదితం కానే కాని విషయాలలో బ్రహ్మాండమైన పరిశోధన ఫలితంగా నూతన పరిజ్ఞానం కలుగుతూ ఉంటుంది. "అణు" శాస్త్రంలో ఈ విధమైన విజ్ఞాన వైశాల్యం ఎంతగా వృద్ధి చెందుతున్నదో నేను ప్రత్యేకంగా చెప్పనక్కఱలేదు. "జ్ఞానము" అన్న శీర్షిక క్రింద వచ్చే విషయాలలో ఇంలాంటి కాలానుగతములైన మార్పులు చేర్పులు ఉన్నట్లు మనం గమనించము. క్రొత్తక్రొత్త విషయాలను తన గుడారంలోనికి ఆకర్షించేది విజ్ఞానం ఇది నిత్యప్రవర్ధమానమైన వైశద్యము. "విజ్ఞాన సర్వస్వము" వంటి గ్రంధాలు క్రమంగా లావెక్కటానికి ఇదొక ముఖ్యకారణం.

ఈ రెండు పదాలకు నిఘంటువులో గల అర్థాలు చూస్తే మనకు కొంత ఉపయోగం ఉంటుంది. శబ్దార్థచంద్రికలో జ్ఞానము అనగా మోక్షవిషయమైన బుద్ధి, తెలివి అని, విజ్ఞానము అనగా శాస్త్రాదుల యందలి జ్ఞానము, విశేషజ్ఞానము అని, ఉన్నది. రెండు శబ్దాలకు గల అర్థభేదం అతి స్పష్టంగా ఎంతవఱకు - ఈ అర్థాలవలన -స్పష్టం అవుతుందో చెప్పటం సులభం కాదుగాని, చూచాయగా జ్ఞానము బుద్ధి సంబంధమైన. మోక్షవిషయాలకు దగ్గఱగా ఉన్నది అన్న అవగాహన మనకు కలుగుతుంది. విజ్ఞానం, మనపై చర్చకు సమానాంతరంగా, శాస్త్రముల యందలి తెలివి అన్న భావం నొక్కి చెపుతుంది. వ్యాకరణ కారణంగా"వి" ఉండి "విశేష జ్ఞానము" అని విజ్ఞానానికి అర్థం కూడా ఆ నిఘంటువులో ఉన్నది. కాని, ఈ రెండుశబ్దాలకు గల భావ వ్యత్యాసం ప్రధానంగా చెప్పబడిన వివరమైన అర్థాల పదాలలో స్పష్టం అవుతుంది. అనగా విజ్ఞానం అనేక విషయాలను గుఱించిన నిక్కమైన తెలివి యని, జ్ఞానం అన్నది సృష్టిలోని మూలాధారమైన, ఆదిమ సిద్ధాంతాలకు సంబంధించినది యని, మనం చెప్పవచ్చును.

మఱొక శాబ్దిక విశేషం. విజ్ఞానం క్రమంగా జ్ఞానానికి మార్గం కావచ్చును (కాక పోవచ్చును కూడ, రావణాసురులవంటి ఉదాహరణలతో). కాని నిక్కమైన విజ్ఞానం అలవడిన కొలది తెలిసిన విషయాల వైశాల్యమే కాక అందలి సత్య బీజాలను గుఱించిన తెలివి కూడ విశాలం అవుతూ ఉంటుంది. తిరిగి ఒక షరా. ఇలావిశాలం అవటం కేవలం విషయగ్రహణ పరిమాణానికి మాత్రం కట్టుబడియుంటుందా, లేక మూలవిషయగ్రహణకు కూడ వర్తిస్తుందా అన్నది ముఖ్యమైన ప్రశ్న. మొదటి అనుభవం మాత్రమే ఉన్న వానికి విజ్ఞాన వైశాల్యం ఏర్పడుతుంది. రెండవది సంభవమైన అదృష్టవంతులకు జ్ఞాన బీజాలు తొలకరిస్తాయి.

ఇంకొక విశేషం. విజ్ఞాన పరిధి పెరిగిన వానికి ఎన్నోవిధాలుగా పాండిత్యం వృద్ధి అవుతుంది. జ్ఞానబీజాలు నాటుకొంటున్నవానికి పాండిత్య వైశాల్యం తో పనిలేదు. మొదటి బృందానికి రావణుడొక విశిష్ట తార్కాణం; రెండవ దానికి ఏకలవ్యుడు. (జాగ్రత్తగా పరిశీలిస్తే యిలాంటి ఉదాహరణలు ఎన్నో దొరకుతాయి.)

ఏకలవ్యుని కథ కొంత వివరంగా చూతాం. అతడు అడవులలో పెరిగిన బాలుడు. అర్జునుని వంటి వారి కున్న విద్యాసౌష్టవం లేనివాడు. తన విలువిద్యకు తాను చూడని ద్రోణాచార్యుని గురువు అన్న భావంతో మనస్సులో నిలుపుకొన్నాడు. అర్జునుని జగదేకవీరునిగా దిద్దవలెనన్న దీక్షతో ఉన్న ద్రోణుడు ఏకలవ్యుని వింటి తీరుకు అచ్చెరువంది,

"నీగురువెవ్వరు" అని అడిగాడు. హృదయనైర్మల్యం గల ఏకలవ్యుడు వెంటనే "ద్రోణాచార్యులు" అన్నాడు. ఆ సమాధానంతో పొంగిపోయిన ద్రోణుడు వెంటనే "మఱి నీ గురువుకు దక్షిణ యీయవా" అన్నాడు. మర్మమెఱుగని ఏకలవ్యుడు "తప్పక, స్వామీ. ఎమి కావాలో చెప్పండి" అన్నాడు. మనసులో కపటం పేరిన ద్రోణుడు వెంటనే "నీ కుడిచేతి బొటన వ్రేలు" అన్నాడు. ఒక్క క్షణమైనా బెదరక, సంతోషం తాండవించే మొగంతో ఏకలవ్యుడు తన కుడి బొటనవ్రేలు కోసి ఆయనకు గురుదక్షిణగా అర్పించాడు. తనయే విద్యకు అచ్చెరువొంది ద్రోణునంతటి వాడు తనను అర్థించాడో, ఆవిద్యకు అత్యవసరమైన తన శరీరాంగం ఏదో, అదిలేక తానిక విలుకానిగా బ్రదుకటం ఎంత దుర్భరమో లేక అసంభవమో, ఎన్నడూ కనపడని యీ "గురువు" కనపడుతూనే తన జీవితసర్వస్వం "దక్షిణ"గా ఎందుకు అర్థించాడో, ఇలాంటి ఆలోచనలు అతని మనసులోనికి రానే లేదు. ఇన్ని తీరుల చర్చించుకొని తనకు క్షేమకరమైన నిశ్చయానికి వచ్చే వివేకం, విజ్ఞానం వానికి లేదు. అంతటి గురువు తొలిసారి దర్శనంలోనే అర్థించినాడే అన్న ఊహ ఒక్కటే వానిని కుదిలించింది. అడిగినది యీయవలెనని, ఇస్తానని ఇచ్చిన మాటను మాఱుతలపు లేకుండా పాటించ వలెనని మాత్రం అతనికి జ్ఞానం ఉంది. వలసిన విజ్ఞానం ఉంటే, ఆ సందర్భం ఆద్యంతము తర్కించుకొని తగు చర్యకు దిగేవాడు. తన విద్య ఆ గురువు ప్రసాదమన్న ఊహతో, అంతవాడు అర్థించినది తాను సమర్పించవలెనన్న సద్బుద్ధితో ఏకలవ్యుడు ప్రవర్తించాడు. ఇది జ్ఞానానికి చిహ్నం.

విజ్ఞానం గలవానికి ప్రతి విషయం గూర్చి సంపూర్ణ చర్చ చేసికొనే నేర్పు ఉంటుంది. కాని వాని తుది నిర్ణయం జ్ఞానం మీద ఆధారపడి యుంటే అందఱకు క్రమంగా క్షేమం కలుగుతుంది. తనకు మనశ్శాంతి కలుగుతుంది.

జ్ఞానం మీద ఆధారపడకుండా కేవల విజ్ఞాన తీక్ష్ణతతోనే మానవుడు తీసికొనే నిశ్చయాలకు ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి: యుద్ధ సందర్భంలో, అణు - అస్త్రాలను ప్రయోగించే సంఘటనలలో. చారిత్రకంగా చూస్తే, తొలినాడు అణు-అస్త్రం ప్రయోగించినప్పటి తక్షణ తృప్తి క్రమంగా మనస్సులను పీడించే ఆరాటంగా మార జొచ్చింది గదా. తక్షణ ప్రయోజనం కొఱకు, విరోధిపై ఆధిక్యం కోసం, అది అవసరమని అనుకొన్నవారు కూడ దానిలోని అమానుషత్వం గూర్చిన జిజ్ఞాసలో హృదయక్షోభను పొందుతూనే ఉన్నారు. ఒక విధంగా చెప్పవలెనంటే, విజ్ఞాన వైశాల్యానికి దక్కిన మారణ యంత్రం జ్ఞాన మార్గానికి అతి - అన్యాయవంతంగాను, ప్రచండ మారణహేతువుగాను కనపడుతుంది.

ఈ సందర్భంలో ఏకొంత గానో ఉపయోగ పడే కథలు మన పూర్వ పురాణాలలో ఉన్నాయి. ఒక్కటి సూక్ష్మంగా పేర్కొంటాను. వాటి ప్రకారం రాక్షసాగ్రేసరులెందఱో ముఖ్యంగా శివభక్తులై, శివుని మెప్పించే ప్రచండ తపస్సులు సలిపారు. కాని విష్ణువును తమ విరోధిగా పరిగణించేవారు. జ్ఞాన రాహిత్యానికి ఇదొక తక్షణ తార్కాణం. శివుడు, విష్ణువు ఒకే దేవుని అంశములు అన్న చిన్న ఆధ్యాత్మిక విశేషం వారి మనస్సుకు తట్టలేదు, వారి విజ్ఞాన పంజరంలో ఈ చిలుక చిక్కలేదు. ఈ లోపానికి మించిన దుర్మార్గశీలంగల ప్రసిద్ధ రాక్షసుడొకడున్నాడు, మన పూర్వకథలలో - భస్మాసురుడు. తన విజ్ఞాన వైశాల్యం, దీక్ష, కారణంగా శివుని సంతుష్ట పఱచి, ఆయననుండి ఒక సులభ వరం పొందాడు - అతి ప్రచండమైనది: తన చేయి ఎవరిమీద వేస్తే వారు భస్మం అవుతారని. ఏ కళ్ళ నున్నాడో ముక్కంటి యీ వరం వానికి ప్రసాదించాడు. ఆ మూర్ఖుడు వెంటనే శివుని మీదనే తన చేయి వేయవలెనని ఎగిరాడు. కథ "గమ్మత్తు" లో పాపం శివుడు దిక్కు లేక చివరకు విష్ణుని సాయం కోరాడు. ఈ "టక్కరి" ఆ రాక్షసుని ఎన్నో విధాల మభ్యపెట్టి, చివరకు ఆ రాక్షసుని చేయి ఆ రాక్షసుని తలమీదనే పెట్టేట్లు చేశాడు; శివుని వరం పుణ్యమా అని మరుక్షణంలో భస్మమైపోయినాడు. ఇలాంటి వరాలు దుష్టుల కీయరాదని శివునికి విష్ణువు చెప్పాడు, చివరకు , అని కథలో చెబుతారు; ఆ శివునికి ఈ మాత్రం తెలియదా అన్నట్లు! మన వ్యాసానికి ప్రధానమైన అంశమే మంటే, ఆ రాక్షసునికి శివుని మెప్పించగల తపశ్శక్తి - విజ్ఞానం - ఉన్నవి కాని విశ్వ క్షేమానికి భంగం కలిగించరాదు అన్న జ్ఞానం లేక పోయింది, అని; ఇది కల్గటం విజ్ఞానం పొందటం కన్న కష్టతరమని కూడ.

వ్యాసం ముగించే ముందు విజ్ఞానానికి, జ్ఞానానికి గల వ్యత్యాసాలు కొన్ని సూక్ష్మంగా స్ఫురింపజేయటం ఉపయోగకరం అనుకుంటాను.

సత్ప్రవర్తన ఎలా ఉండాలో తెలిసియుండటం విజ్ఞానం. అది ఆచరణలో పెట్టగల్గటం జ్ఞానం.

చెడు పనులను, సంఘద్రోహాలను చేయడం తప్పు, చట్ట విరుద్ధం అని క్షుణ్ణంగా తెలిసి యుండటం, ఇతరులకు బోధించడం కూడ, విజ్ఞానసూచకం. అవి చేయకుండా ఉండ గల్గటం జ్ఞానం; తన

చర్యలతో బ్రదుకుతీరుతో - తన విద్వత్తుతో కాదు ఇతరులకు మార్గదర్శకునిగా ఉండటం జ్ఞాన ఫలం.

తాను భజించే దేవుని పై నిరంతర శ్రద్ధ వహించి, తగిన పూజలు చేస్తూ ఉండటం విజ్ఞాన సూచకం. అందరు దేవుళ్ళు ఒకటేయని గుర్తించి, అందరి పూజలయెడ సమదృష్టి కలిగి, నిజంగా మనం కొలిచేది ఒకటే భగవదంశం అని, ఎవరేపేరుతో దేవుని ఆరాధించినా ఒకటే యని నిర్మల హృదయంతో నిరూపించటం జ్ఞానం.

దీని కొక పొడిగింపు: తాను కొలిచే దేవుని విగ్రహానికి రకరకాల అలంకరణాలు చేస్తూ, మనం ఏ మహారాజుకో కలిగించదలచిన సంతోషం, పులకింపు కోసం ప్రయత్నాలు చేయటం - ఏమీ తప్పు లేదు కాని - తనకు గల విజ్ఞాన బాహుళ్యానికి తార్కాణం, లేక ఫలం; కాని మనస్సున కుదురు కల్గి ఏదో ఒక దైవముపై - తన యిచ్చ కల్గిన రీతిని - నిష్ఠ సంపాదించుకొనటం జ్ఞాన చిహ్నం.

శాస్త్ర రీత్యా నిత్యం నూతన విషయాలు బైటపడుతూ ఉంటాయి. అవి తెలిసికొనటం, వాటిని సరిగా అన్వయించటం, అంతకు ముందు మనకు తెలిసిన విషయాలతో పొందుకూర్చటం - ఇదంతా విజ్ఞానం లోని క్రమం. జ్ఞానం విషయంలోనో - సత్యం వద ధర్మం చర వంటి కొలది మూల సూత్రాలపై దృష్టి బఱపి, అంతకు మించి, ఆ త్రోవను తప్పకుండా బ్రదుక ప్రయత్నించటం జ్ఞానపథం.

ఈ నూతన విషయ పరిచయంలో - ముఖ్య ఉదాహరణం యుద్ధప్రక్రియలు. కొన్ని అంశాలు తెలిసికొనటానికి, ఎదుటి వారు అవి ఉపయోగిస్తారేమో యన్న దూరదృష్టితో తాము కూడ తగిన సిద్ధస్థితిలో ఉండటానికి పనికి వస్తాయి. అణు-అస్త్రాలతో కల్గగల విపరీత పరిశోధనలు ఈ కక్షకు చెందుతాయి. ఇవి విజ్ఞాన తార్కాణం కావచ్చును గాని, జ్ఞాన సూచకములు కావు. వాస్తవప్రపంచంలో ఇలాంటి క్రొత్త విషయాలకు అవసరం ఉన్నదని ప్రభుత్వాలు గమనించవచ్చును; కాని ఆంతరంగిక నైర్మల్యం కోసం తపన పడే జ్ఞాన - అన్వేషకులకు అవి అజ్ఞానవంతమైన క్రీడలని అనిపిస్తాయి. విజ్ఞానం కోసం అవి సాధించినా, జ్ఞానం కల్గి వాటి దురుపయోగం వర్జించాలి.

ఈ వ్యాసం చివరలో ఒక మాట. ఇలాంటి చర్చకు వలసిన వి జ్ఞానం కలదా యని ఆలోచించుకొనె జ్ఞానం కొఱవడి యిది వ్రాశాను.

*****